# తుఫాన్



అనిశెట్టి శ్రీధర్

తన గుడిసె ముందు రెండు చేతులూ మోకాళ్ళ చుట్టూ బిగించి కూర్చుని ఆకాశానికేసి చూస్తోంది నారాయణమ్మ. ఆకాశం నిర్మలంగా లేదు. బాధతో కుమిలిపోతున్నట్టుగా వుంది. అవమాన భారంతో బుసలుకొడుతున్నట్టుగా గాలి వీస్తోంది.

అల్లంత దూరాన భూపతి మేడ భూపతిలాగే ఠీవిగా, నిర్లక్ష్యంగా నిలబడివుంది. మేడ చుట్టూ 'నీ కాల్మొక్త బాంచెన్' అన్నట్టు గుడిసెలు పడున్నాయి.

ఏడేళ్ళ క్రితం భర్త చనిపోయి వారం తిరక్కుండానే నారాయణమ్మ పనిలోకి వెళ్ళవలసిన పరిస్థితులు. భూపతి నారాయణమ్మ మీద విపరీతమైన జాలి కురిపించాడు. నీకు జరిగిన అన్యాయాన్ని చూస్తుంటే భగవంతుడున్నాడా అన్న అనుమానం కలుగుతుందన్నాడు. నీకేం భయం లేదన్నాడు. నీ పిల్లోడ్ని చదివిస్తానన్నాడు. పిల్లకి పెళ్ళీడు రాగానే పెళ్ళి చేసే పూచీ నాది అన్నాడు. భూపతి నారాయణమ్మ భర్త గురించి ఒకటే పొగిడాడు. అంత కష్టజీవి మరోడు లేడన్నాడు. నారాయణమ్మ భర్త మాట రాగానే భోరున ఏడ్చింది. భూపతి ఓదార్పుగా ఓ చెయ్యి వేశాడు. తరువాత రెండు చేతుల్తో నారాయణమ్మను చుట్టేశాడు. నారాయణమ్మ బిత్తరపోయింది. బ్రతిమలాడింది, మీకు న్యాయం కాదని. భూపతి వినలేదు. నారాయణమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. భూపతి కరగలేదు. నారాయణమ్మ తిరగబడింది. కాని భూపతి పశుబలం ముందు ఓడిపోయింది.

ఆ క్షణానే సముద్రంలో పడి చచ్చిపోదామనుకుంది నారాయణమ్మ. కాని ఇంటి దగ్గర తన కోసం ఎదురుచూసే, తను ఇంత ఉడకేసి పెడితే కాని కడుపు చల్లారని రెండు పసి ప్రాణాలు వున్నాయని తల్లి మనసు హెచ్చరించడంతో ఆ ప్రయత్నాన్ని మానుకుంది. ఈ ఏడేళ్ళలో ఏ రోజూ ఆ దుస్సంఘటనను మరచి బ్రతకలేదు నారాయణమ్మ. ఆ అవమానం గుండెల్లో రావణకాష్టంలా రగులుతూనే వుంది.

కూతురు రాజీ, కొడుకు రంగడు కోసమే జీవచ్ఛవంలా జీవనం సాగించింది. పిల్ల పెళ్ళీడుకొచ్చింది. బస్తీలో వున్న సూరమ్మత్త రాజీకి బంగారంలాంటి సంబంధం తీసుకొచ్చింది. పిల్లాడు బుద్ధిమంతుడు. ఏదో కంపెనీలో ప్యూన్ ఉద్యోగం. ఐదు వందలు జీతం. జీతం ఎంతో చెప్పేటప్పుడు

సూరమ్మత్త కళ్ళు పెద్దవి చేసుకుని మరీ చెప్పింది. పిల్ల నచ్చితే చాలన్నట్టు. "మన రాజీకేం సినమా యాక్టేరులాగుంటది. సమ్మందం కాయం అనుకో"

పిల్ల పెళ్ళి అయిపోతోందనే సంబరంలో నారాయణమ్మ ఉండగా– రెండ్రోజుల క్రితం పన్లోకి వెళ్ళిన రాజీ సాయంత్రమయ్యేసరికి బాధతో కుమిలిపోతూ, అవమానభారంతో కుంగిపోతూ, నోటికి కొంగు అడ్డం పెట్టుకుని కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ ఇంటికొచ్చింది. ఒళ్ళంతా గీరుకుపోయి, గుడ్డలు అస్తవ్యస్తంగా చుట్టబెట్టుకుని పరుగులాంటి నడకతో ఇంటికొచ్చి పడింది.

నారాయణమ్మ "ఏటయిందే తల్లీ" అని అడగలేదు. కొయ్యబారిపోయింది. రాజీ తల్లిని వాటేసుకుని భోరుమంది.

పదహారేళ్ళ లేబ్రాయపు కన్నెపిల్ల. మంచి మొగుడు రాబోతున్నాడని బతుకు గురించి కలలు కంటున్న అమ్మాయి. ప్రకృతి మాత ఒడిలో పెరిగి,




మట్టి వాసలు విరజిమ్ముతూ పచ్చని పైర్లను చూసి పరవశించిపోతూ, కోకిల గొంతుతో గొంతు కలిపిన పడుచు. మనిషిలోని వాంఛకూ, దాహానికీ బలయింది.

"ఈ ఊర్లో ఒక్క నా కొడుక్కి ఇదేటన్నేయవని అడిగే దయిర్నం లేదు" గొణిగింది నారాయణమ్మ. అడిగే ధైర్యం చేసిన నారాయణమ్మకు మిగిలింది ఒంటి నిండా దెబ్బలు.

ఈ రెండు రోజులుగా నారాయణమ్మ పనిలోకి వెళ్ళలేదు. రాజీ సంగతి సరేసరి. తనలో తాను కుళ్ళిపోతూ అలా పడుంది.

XX XX XX

పట్టపగలే చీకటిగా వుంది. సూర్యుడు ఏ మబ్బుల చాటున దాక్కున్నాడో చెప్ప కష్టతరంగా వుంది. భూపతి పాలేళ్ళు రేడియోలో తుఫాను వస్తుందని చెప్పారని, పల్లపు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయిస్తారని వార్త మోసుకొచ్చారు.

తుఫాన్ హెచ్చరిక విన్న పల్లెజనం గుండెలు గుభేలుమన్నాయి. తట్టా, బుట్టా సర్దుకుని ఊరు వదిలి వెళ్ళవలసిందేనా! ఎక్కడికక్కడ చర్చలు జరువుతున్నారు.

తుఫాన్ రాబోతోందని విన్న నారాయణమ్మ అణుమాత్రం కూడా చలించలేదు. గుడిసె ముందు చాలాసేపు అలానే కూర్చుంది.

తర్వాత లేచి లోపలకు వెళ్ళింది. కూతురు ఒక మూలగా ఏడవడానికి కూడా ఓపిక లేక నిస్త్రాణగా కూర్చునుంది. ఎటు చూస్తున్నాయో కూడా తెలియకుండా కళ్ళు నిస్తేజంగా వున్నాయి. రంగడు ప్రక్కన కూర్చుని బేలగా చూస్తున్నాడు. రెండ్రోజులుగా పొయ్యి రాజెయ్యనే లేదు. నారాయణమ్మ, రాజీ ఏమీ తినడం లేదు. ఉన్నదేదో రంగడికి పెడుతున్నారు. వాళ్ళు మాత్రం మంచినీళ్ళతో సరిపుచ్చుకున్నారు. రాజీ అయితే ఆ నీళ్ళు కూడా బలవంతంగా గొంతులో పోసుకుంటోంది.

XX XX XX

ఊరంతా గందరగోళంగా వుంది. పట్నం నుంచి వచ్చిన లారీల రొద. అధికారుల ఆజ్ఞలు. ప్రతి కుటుంబం హడావుడి, హైరానా పడుతోంది. ఏవేం సామాన్లు తీసుకెళ్ళాలో ఆలోచనలు పడుతున్నారు. నులక మంచం దగ్గర్నుండి బట్టలు, రేకు డబ్బాలు, అల్యూమినియం పాత్రల వరకూ అన్నీ విలువైనవిగానే కనిపిస్తున్నాయి. కొంతమంది. తమకున్న ఒకటి, రెండు మేకల్నీ, కోళ్ళనూ కూడా తమతో తీసుకెళ్తున్నారు. సామాను వీలైనంత తక్కువ తీసుకురమ్మని అధికారులు హెచ్చరిస్తున్నారు. తిరిగొచ్చేసరికి పాకలు వుంటాయో, ఊడతాయో, ప్రభుత్వం ఎంత సాయం చేస్తుందో, అందులో తమదాకా వచ్చేసరికి ఎంత మిగులుతుందో ఎవరికి తెలుసు! సామాను అంతా తమతో తీసుకువెళ్ళడానికే ప్రయత్నిస్తున్నారు.

నారాయణమ్మ మాత్రం కూతుర్నీ, కొడుకునీ ప్రక్కన కూర్చోబెట్టుకుని నిమ్మకు నీరెత్తినట్టుగా వుంది. పట్నం తరలిపోవడానికి ప్రయత్నాలేవీ జరుగుతున్నట్టు కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వాకబు చేయడం మొదలుపెట్టారు.

"మేం ఈడనే వుంటం" అంది నారాయణమ్మ.

"పిచ్చా ఏంది నారాయణమ్మ! పేనాలు పొగొట్టుకోవాలనా ఏంది కరమ. నువ్వీడనే కూకుంటే గుడిసె, సామాను ఏం గావనుకుంటన్నారా. మొత్తం కొట్టకపోతారు జాగరత" రకరకాలుగా వ్యాఖ్యానించారు. పొరుగునున్న వీర్రాఘవులు ఎంతగానో చెప్పిచూశాడు.

"ఇదేం పంతవే నారాయణమ్మా. ఎవురి మీద కోపం ఎవురి మీన చూపతానంటావ్. రాజీ ఏందే ఇది? నువ్వన్నా సెప్పవే మీ యమ్మకి, పద సామాను కట్టు".

రాజీ రానన్నట్టు తలాడించింది. 'తల్లికి తగ్గ కూతురు'

"సరే మీ ఇద్దరూ సస్తే సావండి. రంగడ్నినే తీసకపోతా" అన్నాడు. వాడికా పేరు పెట్టింది వీర్రాఘవులే. మట్టిబొమ్మలు తయారుచేసి బస్తీలో అమ్మడం అతడి వృత్తి. వీర్రాఘవులు పాండురంగస్వామికి పరమభక్తుడు. ఊళ్లో గుడి సగం వాడి చేతుల మీదగానే కట్టబడిందంటే అతిశయోక్తికాదు. విగ్రహాన్ని మలచడంలో అతడు పడిన శ్రమ అంతా ఇంతా కాదు.

రంగడి మాట వినేసరికి నారాయణమ్మలో కదలిక లాంటిది కనిపించింది.

"రారా రంగా" పిలిచాడు రాఘవులు.

"నేరాను" అంటూ తల్లిని కరుచుకుపోయాడు రంగడు.

వీర్రాఘవులు నిస్సహాయుడై వెనుదిరిగాడు.

* * *

భూపతి కిటికీలో నుండి బయటకు చూశాడు. గాలి తీవ్రత ఎక్కువగా వుంది. ఆడా, మగా జనం నెత్తిమీద మూటలతో, వీపులమీద గోనె సంచులు వేసుకుని లారీలు ఎక్కుతున్నారు. పిల్లలు చేతుల్లో చెంబు, తపాళల్లాంటివి పట్టుకుని తలిదండ్రుల హెచ్చరికలు, కేకల మధ్య వాళ్ళను అనుసరిస్తున్నారు.

చేతిలోని గ్లాసులోని ద్రవం గొంతులోకి మెల్లగా జారుతుండగా భూపతి ఆలోచిస్తున్నాడు.

భూపతి భార్య ఏవో నోములంటూ నగలు ఒంటి నిండా దిగేసుకుని పుట్టింటి కెళ్ళింది. పూజలు, నోములు అంటే భూపతి అడ్డుచెప్పడు. భార్య

ఎంత డబ్బు ఖర్చు పెట్టినా కాదనడు. అవే తనని ప్రజల శాపనార్థాల నుంచి కాపాడుతున్నాయని, తన సుఖ సంతోషాలకు కారణమైన సంపదను మరింతగా పెంచడానికి కారణభూతమని అతడి నమ్మిక. అందుకే ఊళ్ళో పాండురంగస్వామి ఆలయాన్ని ఊరి జనం శ్రమదానం చెయ్యగా సొంత డబ్బుతో కట్టించాడు.

భార్య నగలు పెట్టుకువెళ్ళినా, ఇనప్పెట్టెలో ఇంకా బోలెడు బంగారం మూలుగుతోంది. అప్పటికే నోట్ల కట్టలన్నీ గుమాస్తా చేతికిచ్చి పట్నంలో బాంకు ఖాతాలో జమ చేయించాడు. ఊరి జనం, సన్నకారు రైతులు తీసుకున్న అప్పులు తాలూకు పత్రాలన్నీ ఇనప్పెట్టెలోనే తమను విడిపించే నాథుడు లేక పడున్నాయి. అన్నం తినే పళ్ళాలు, పూజ సామాను అన్నీ వెండివే. ఎన్నని మోసుకెళ్ళగలడు? విలువైన సామానంతా పై అంతస్తులోకి చేర్చారు. రిఫ్రిజిరేటర్‌లో వారం రోజులకి సరిపడా తిండి, మందు వున్నాయి.

పాలేళ్ళు నమ్మకమైన వాళ్ళే. వాళ్ళను కాపలా పెట్టి తను మామగారి ఊరు వెళదాం అనుకున్నాడు భూపతి. కాని ప్రకృతి 'ఓ మనిషీ ఇదే నీ అంతం' అన్నట్టు విలయతాండవం చేస్తుంటే మనిషి మనసులో ఎన్ని వికృత భావాలు చెలరేగుతాయో ఈ ఆలోచన రావడంతో తన ప్రయాణం మానుకున్నాడు.

* * *

వర్షం పెద్దపెట్టున మొదలయింది.

నారాయణమ్మ పాక ముందు నుండి జనం సాగిపోతున్నారు. మధ్య మధ్య మాటలు.

"భూపతిబాబు పట్నం ఎలిపోనాడ్రేటా?"

"ఆయనగోరు ఎల్లడంట. అయినా ఆయన కేట్రా. రెండో అంతస్తులో కూకొని బుడ్డి మీన బుడ్డి లాగించేస్తా వుంటాడు. తుపాను ఆయన్ల టోల్ల జోలికెల్తాదేటి?"

గుమస్తా కుటుంబం, ముగ్గురు, నలుగురు మధ్యతరగతి రైతులు కూడా ఊరు విడిచి వెళ్ళడమే క్షేమమని నిర్ణయించుకున్నారు. ఊళ్ళో మిగిలింది అటు భూపతి, ఇటు నారాయణమ్మ కుటుంబం. వర్షం ఉధృతంగా కురుస్తోంది.

* * *

సాయంత్రం అయ్యేసరికి గుడిసెలోకి రెండు అడుగుల లోతు నీళ్లు చేరాయి. గుడిసె పై భాగంలో ఒక మూలగా అటకలాంటిది చేసి పెట్టాడు నారాయణమ్మ భర్త. నేల మీదనున్న సామాను అటకపైకి ఎక్కించే ప్రయత్నం ఏమీ చెయ్యడం లేదు నారాయణమ్మ, రాజీ. రంగడికేమీ అర్థం కావడం లేదు. నులక మంచంమీద కూర్చున్నా నీళ్ళు మంచం కింద నుంచి తగులుతున్నాయి. గుడిసెపైని తాటాకులు ఒకటి, రెండు గాలి తాకిడికి ఎగిరిపోయి వర్షం లోపలికి కుండపోతగా కురుస్తోంది. ఎక్కడో పిడుగు ఫెటేల్‌మని పడిన శబ్దం. రంగడు 'అమ్మ' అంటూ భయంతో తల్లి దగ్గరకు జరిగాడు. నారాయణమ్మ కొడుకుని అక్కున చేర్చుకుంది. ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు జలపాతాల్లా దూకుతున్నాయి. రాజీ ఏం తీసిపోలేదు.

"ఆయన గోరు ఎల్లడంట. తుపాను ఆయన్లోటోల్ల జోలికెల్తాదేటి?"

జనం మాటలు పదే పదే జ్ఞప్తికి వస్తున్నాయి.

తల్లీ కూతుళ్ళు ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. కళ్ళనీళ్ళు తుడుచుకుని, రంగడిని ఎత్తుకుని అటకమీదకు ఎక్కించింది తల్లి.

"నాయనా మేమొచ్చిందాకా ఈడనే కూకో. బయపడమాక" అని జాగ్రత్తలు చెప్పి కూతురు వెంటరాగా బయటకు నడిచింది నారాయణమ్మ.

గుడిసెల్ని చుట్టుముట్టిన నీళ్ళు ప్రవాహంలా పారుతున్నాయి. పల్లె జనం వదిలి వెళ్ళిన సామాను కొన్ని నీళ్ళపై తేలియాడుతూ కొట్టుకుపోతున్నాయి.

* * *




భూపతి కిటికీ కొద్దిగా తెరచి బయటకు చూశాడు. వర్షం నీళ్ళు నదిలా అలల్లా పారుతున్నాయి. క్రింది గదుల్లోకి నీళ్ళు వెళ్ళే వుంటాయి. తనకు ఊహ తెలిసి తుపానులప్పుడు క్రింది గదుల వరకే నీళ్ళు రావడం. తండ్రి అందుకే మొదటి అంతస్తు కట్టించాడు. తను ముందు జాగ్రత్తగా రెండో అంతస్తు.

మందు కార్యక్రమం పూర్తయింది. ఇక తిండి తినాలి. తర్వాత శరీరం సుఖాన్ని కోరుతోంది. ఆ సుఖం నిద్ర ఇచ్చేది కాదు. నిద్రపోయే ముందు పొందే సుఖం కావాలి.

రెండ్రోజుల క్రితం తను బలవంతంగా అనుభవించిన సుఖాన్ని నెమరేసుకున్నాడు భూపతి. 'ఎంత కష్టపెట్టేసింది పిల్ల. నలుగురు పాలేళ్ళు కాపుకాసి పట్టి కింద పడేసినా ఎలా ఎగిరిపడింది!' గడియపెట్టి వున్న తలుపులు ఒక్క ఉదుటున తెరుచుకున్నాయి. గాలి విసురుకి అనుకున్నాడు భూపతి. తలెత్తి చూసిన భూపతికి ఎదురుగా కనిపించింది అతడు కోరుకుంటున్న ఆడ శరీరం. ఒకటి కాదు రెండు శరీరాలు.

భూపతి మెదడు మొద్దుబారిపోయి వుంది. అతడికేమీ అర్థం కాలేదు.

నారాయణమ్మ, రాజీ ఇంటికొచ్చేసరికి నీళ్లు నాలు గడుగులలోతుకి చేరాయి. రంగడు బిక్కుబిక్కుమంటూ అటకమీద. నారాయణమ్మ వాడిని భుజాలమీద కూర్చోబెట్టుకుని కూతురితో సహా బయటకు నడిచింది. రెండు రోజులుగా ఉపవాసం, ఒంటి నిండా దెబ్బలు. కాళ్లు సహకరించనంటున్నాయి. కూతురు భుజాన్ని ఆసరాగా చేసుకుంది నారాయణమ్మ. దారి కూడా కనిపించడంలేదు. ఎక్కడ చూసినా నీళ్లు, నీళ్లు. వస్తున్న గాలికి ఎక్కడ కొట్టుకుపోతారోనంత భయంగా వుంది. గుండెల వరకు నీళ్లు; కాలుతీసి, కాలు వెయ్యడం కష్టంగా వుంది. ఎక్కడికి వెళ్తున్నారో రంగడికి అర్థం కావడంలేదు. అల్లంత దూరాన గుడి కనబడుతోంది.

గుడి ఉండే ప్రదేశం కాస ఎత్తులో వున్నందున నీళ్లు నడుముల వరకే వచ్చాయి. గుడిలోకి ప్రవేశిస్తూనే నారాయణమ్మ కొడుకుని కిందకు దించింది. పాండురంగస్వామి విగ్రహం తాను నిమిత్తమాత్రుడిని అన్నట్టుగా వుంది. ఆయన నిమిత్తమాత్రుడా? సూత్రధారా? తల్లి, అక్క ఎందుకు నమస్కరిస్తున్నారో తెలియకపోయినా రంగడు కూడా కళ్లు మూసుకుని పాండురంగస్వామికి నమస్కరించాడు.

అక్క రాజీ రంగణ్ని తన భుజాలకెత్తుకుంది. నారాయణమ్మ క్రింద గొంతుక్కూచుంది. విగ్రహాన్ని ఊతంగా చేసుకుంటూ ఒకదాని తరువాత ఒకటిగా అరికాళ్లను తల్లి భుజాలపై మోపుతూ పైకెక్కింది రాజీ. శక్తినంతా కూడదీసుకుని లేచి

## తెల్లమచ్చలకు చికిత్స

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరం లేదు. అట్టి వాటి వివరాలు ఇంగ్లీషులో తెలిపి రెండు చిన్న సీసాల మందు ఉచితంగా పొందండి. మా మందు వాడడం మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడం ప్రారంభమగును. చాలా మంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యుని ద్వారా చికిత్స పొందండి.

**Vaidya M K Mathur (MKT)**

**Po. Katri Sarai, Gaya**

## తెల్ల వెంట్రుకలు

హేర్ డైతో కాదు. మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లబడడం ఆటంకపరచవచ్చును. మొదలు నుండే నల్లజుట్టు రావడం మొదలై జుట్టుని తెల్లబడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది. వేలమంది లాభం పొందారు. ఈ చికిత్స ద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి. ఒక చిన్న సీసా వెల రూ. 25/-. మూడు సీసాల వెల రూ. 70/-. మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ ఇస్తే ఒక సీసా ఉచితం.

**Vaidya M K Mathur (MKT)**

**Po. Katri Sarai, Gaya**


నిలబడింది అమ్మ నారాయణమ్మ. పాండురంగ స్వామి విగ్రహం తలభాగమే రెండు అడుగుల పొడుగు వుంటుంది. రంగడు అక్క భుజాల పైనుండి లేస్తూ రెండు చేతుల్లోనూ విగ్రహం తల భాగాన్ని వాటేసుకుని పాదాలు పాండురంగస్వామి రెండు భుజాలమీద ఆన్చాడు. కిందకు చూడడానికి భయమేసింది వాడికి. కొద్ది క్షణాల తర్వాత తల్లి, అక్క పైకి వస్తున్నారా అని కిందకు చూశాడు. ఎవరూ లేరు. నీళ్లు నడుంలోతు మాత్రమే వున్నాయి. మునిగిపోయే ప్రమాదమే లేదు. మరి 'ఏమయ్యారు? ఎక్కడికెళ్లారు? "అమ్మోవ్, అక్కోవ్" అంటూ కేకలు పెట్టాడు. జవాబులేదు. వాడికి భయం వేసింది. అలా పలుమార్లు కేకలు పెట్టాడు. గుడిలో భాగంలో వాడి అరుపులు ప్రతిధ్వనించాయి. కాసేపటికి గాలి హోరులో వాడి అరుపులు వాడికే వినిపించలేదు.

xxx xxx xxx

తుపాన్ కరాళ నృత్యం చేస్తోంది. మిన్ను, మన్ను ఏకమైనట్టుంది. వీస్తున్న ప్రభంజనానికి ఇళ్లపై కప్పిన తాటాకులు గాలిలో సుడులు, సుడులుగా తిరుగుతున్నాయి. సముద్రంలో ముప్పై అడుగుల ఎత్తున సుడిలా లేచిన అలలు ఊరు ఊరంతటినీ కబళించి వేయడానికన్నట్టు ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. ఊళ్లో నీటిమట్టం హఠాత్తుగా పెరిగిపోయింది.

xxx xxx xxx

ప్రకృతిని లొంగదీసుకోవడానికి, తన స్వార్థం కోసం నాశనం చేయడానికి మానవుడు చేస్తున్న దారుణ యత్నాలకు సవాలుగా రెండు రోజుల పాటు ప్రళయాన్ని సృష్టించిన తుపాన్ తగ్గుముఖం పట్టింది. ఇక భయంలేదన్నారు. వందల గ్రామాలు జల దిగ్బంధనంలో వుండిపోయాయి. ముందు జాగ్రత్త చర్యలవల్ల ప్రాణనష్టం ఎక్కువగా జరగలేదు.

xxx xxx xxx

ఊళ్లోకి ప్రవేశించిన నీరు మరో రెండు రోజులకి తీసేసింది. ఊళ్లోకి అడుగుపెట్టిన జనం గొల్లుమన్నారు. తుఫాన్ బీభత్సం అడుగడుగునా కనబడుతోంది. నేల అంతా బురదమయంగా వుంది. అడుగుతీసి అడుగు వేయడమే కష్టంగా వుంది. ఒక్క ఇల్లు వున్న ఆనవాలు కనిపించడంలేదు. పాతిన గుంజలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. తాటాకు మట్టలు చెల్లాచెదురుగా పడి వున్నాయి. చెట్టు, చేమా నేలకొరిగాయి. తెగిపడిన కరెంటు తీగలు, కూలిన స్తంభాలు వినాశనాన్ని మిగిల్చి వెళ్లింది. ఇది తమ ఊరే అని చెప్పకోవడానికి గుర్తుగా ఒక వైపు భూపతి మేడ, మధ్యలో కూలిన రెండు, మూడు మిద్దెలు, రెండోవైపు పాండురంగస్వామి ఆలయం.

భూపతికోసం చూసిన పాలేళ్లు తలుపులు బార్లా తెరచి వుండడం, భూపతి కనిపించకపోవడంతో విస్తుపోయారు. ఒకవేళ ఊళ్లో అందరూ ఖాళీ చేశాక అతనూ బయల్దేరి వచ్చేశాడా అంటే తలుపులు, తాళాలు వెయ్యకుండా ఎందుకు వెళ్తాడు. నీటిమట్టం చూద్దామా అంటేమొదటి అంతస్తులోకి వచ్చిన దాఖలాలే లేవు. రెండో అంతస్తులో భూపతికి ప్రమాదం జరిగే అవకాశాలు లేవు. ఎక్కడి సామాను అక్కడే వుంది. మందు మోతా ఎక్కువై క్రిందకు దిగి వుంటాడని, నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి వుంటాడని నిర్ధారించారు. శవం కోసం చుట్టుప్రక్కలంతా గాలించారు. ప్రయోజనం శూన్యం.

నారాయణమ్మ కుటుంబం ఏమయిందో?

వీర్రాఘవులు కిందా, మీదా పడుతూ పరుగెత్తుతూ పాండురంగస్వామి ఆలయాన్ని చేరుకున్నాడు. వాడు భయపడినట్టుకాక ఆలయం బాగానే వుంది. గోడలన్నీ నీళ్లలో నానిన గుర్తులున్నాయి. గుళ్లోకి ప్రవేశించి పాండురంగస్వామి విగ్రహాన్ని చూసిన వీర్రాఘవులు నిర్ఘాంతపోయాడు. రంగడు పాండురంగస్వామి భుజంపై కూర్చుని తల భాగాన్ని కావలించుకుని స్పృహ లేని స్థితిలో వున్నాడు. విగ్రహం భుజాల వరకు నీళ్లు వచ్చినట్టు అక్కడక్కడా అంటుకుని వున్న గడ్డిపరకలు, ఆకులు చెబుతున్నాయి.

రంగడ్ని క్రిందకు దించారు. ఎక్కడానికి ఎక్కడా పట్టుదొరకని విగ్రహం పైకి ఏడేళ్ల బుడతడు ఎలా ఎక్కాడు? వాడ్ని అడిగితే సమాధానం రాదు. నీ తల్లి, అక్క ఏమయ్యారా అంటే నోరు మెదపదు.

తుఫాన్ వల్ల కనిపించకుండా పోయిన, మరణించిన వారి లిస్టులో భూపతి, నారాయణమ్మ, రాజీల పేర్లు నమోదయ్యాయి. శవాలు ఎక్కడా దొరకలేదు. ఎటు కొట్టుకుపోయాయో! భూపతి శవం కానీ కనిపించే వుంటే... దొరికితే ఇద్దరు మనుషులు (ఆడవాళ్లయితే మాత్రం) కలిపి మెడకు తాడుని బిగించి, చచ్చాడా లేదాన్న అనుమానం తీరేదాకా చెరోవేపు లాగిన ఆ ఆనవాళ్లు కనిపించే వుండేవి.

